


PRGI NO: TGTEL/25/A5314

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్




నల్లగొండ | హైదరాబాద్ | రంగారెడ్డి | epaper.arjun saamaacharam.com | మంగళవారం 30, జూన్ 2026 | సంపుటి :1 సంచిక : 180 | పేజీలు : 8 , వెల.2.00

# భారత ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో పుంజుకుంది

డేటా ఆధారిత నిర్ణయాలే 'వికసిత్ భారత్'కు పునాది

ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా

2 లో..



భారత ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో పుంజుకుందని ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రమోద్ కుమార్ మిశ్రా స్పష్టం చేశారు. ఇటీవల విడుదలైన త్రైమాసిక, వార్షిక స్థూల దేశీయోత్పత్తి గణాంకాలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో ఇవాళ జరిగిన 20వ జాతీయ గణాంక దినోత్సవం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం పటిష్ఠమైన రికవరీని సాధించిందని మిశ్రా అన్నారు.






## ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అంత్యక్రియలు.. భారత్ తరపున హాజరు కానున్న కేంద్ర మంత్రి!

ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు భారత్ తరపున విదేశాంగ శాఖ సహాయమంత్రి పబిత్ర మార్గరీటా హాజరుకానున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మంత్రి పబిత్రతో పాటు బిహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ కూడా వెళ్లనున్నట్టు తెలుస్తోంది. అయతొల్లా ఖమేనీ అంత్యక్రియలకు రావాలని ప్రధాని మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఇటీవల ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో భారత్ తరపున కేంద్ర మంత్రి, బిహార్ గవర్నర్ ఇరాన్‌కు వెళ్లనున్నట్టు తెలుస్తోంది. అయతొల్లా జన్మస్థలమైన మష్హాద్ నగరంలోనే జులై 4న ఆయన అంత్యక్రియలను నిర్వహించనున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు ఫిబ్రవరి 28న దాడులు ప్రారంభించిన విషయం తెలిసిందే.

వార్త 2లో



## జైపుర్‌లో విషాదం.. గోడ కూలడంతో ముగ్గురు కార్మికుల మృతి

రాజస్థాన్ జైపుర్‌లోని చందవాజీ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఓ భవనం గోడ అకస్మాత్తుగా కూలిపోవడంతో ముగ్గురు కార్మికులు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. కాగా.. కూలీలతో సహా 12 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకుపోయి ఉంటారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది: శివరాజ్‌సింగ్



2

తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందన్నారు. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఎస్‌వై రహదారుల పనులు వేగవంతం కావాలని పేర్కొన్నారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు.



2

## వర్షం ఎఫెక్ట్.. మధిర రైతు ఆశీర్వాద సభ రద్దు.. హైదరాబాద్‌కు షిఫ్ట్

## డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని మా అనుమానం: కవిత



2

దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) జరిగిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని.. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈరోజు (సోమవారం) హైదరాబాద్ వేదికగా కవిత మీడియాతో మాట్లాడారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని.. వీటిని తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందని ప్రస్తావించారు.

2



## 'అయోధ్య విరాళాల కేసు నిందితుల తరపున ఎవరూ వాదించొద్దు

## ఏరువాక పౌర్ణమి తెలంగాణ రైతుల సంస్కృతికి ప్రతీక

2



ఏరువాక పౌర్ణమి తెలంగాణ రైతుల సంస్కృతికి ప్రతీక అని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. రైతులందరికీ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు (సోమవారం) కూరెళ్ల గ్రామంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని రైతులతో కలిసి మంత్రి పొన్నం దుక్కి దున్ని విత్తనాలు చల్లారు.

2



## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో లేజర్ లైట్ల కలకలం..

శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం అర్ధరాత్రి లేజర్ లైట్లు కలకలం రేపాయి. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి వస్తున్న లుఫ్తాన్సా విమానం హైదరాబాద్‌కు చేరుకుని ల్యాండింగ్‌కు సిద్ధమైంది

## నితిన్ నబీన్ బిహార్ మైండ్ సెట్ క్లియర్‌గా కనిపిస్తోంది: చామల

హైదరాబాద్:

బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కు తెలంగాణ రాజకీయాలపై అవగాహన లేదని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. నితిన్ నబీన్ బిహార్ మైండ్ సెట్ క్లియర్ గా కనిపిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో తెలంగాణను ఎటిఎమ్ లా వాడుకున్నారని చెప్పారని తెలియజేశారు. అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్నది బిజెపి కాదా? అని 2014 బిజెపి మేనిఫెస్టోలో ఎన్ని ఉద్యోగాలిస్తామన్నారు? ఎన్ని ఇచ్చారు? అని చామల ప్రశ్నించారు. అజెండానే లేని బిజెపి..తెలంగాణ జెండా ఎలా ఎగరేస్తుంది? అని చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు.



2



## జీవితం.. వందమీటర్ల పరుగుపందెం కాదు.. మన ఓపికకు పరీక్ష : నితిన్ నబీన్

# ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అంత్యక్రియలు.. భారత్ తరపున హాజరు కానున్న కేంద్ర మంత్రి!

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు భారత్ తరఫున విదేశాంగ శాఖ సహాయమంత్రి పబిత్ర మార్గరీటా హాజరుకానున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మంత్రి పబిత్రతో పాటు బిహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ కూడా వెళ్లనున్నట్టు తెలుస్తోంది. అయతొల్లా ఖమేనీ అంత్యక్రియలకు రావాలని ప్రధాని మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఇటీవల ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో భారత్ తరఫున కేంద్ర మంత్రి, బిహార్ గవర్నర్ ఇరాన్‌కు వెళ్లనున్నట్టు తెలుస్తోంది. అయతొల్లా జన్మస్థలమైన మష్హాద్ నగరంలోనే జులై 4న ఆయన అంత్యక్రియలను నిర్వహించనున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు ఫిబ్రవరి 28న దాడులు ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలి రోజు జరిగిన దాడిలోనే ఖమేనీ కన్నుమూశారు. దాదాపు 36 ఏళ్ల పాటు ఆయన ఇరాన్‌ను ముందుండి నడిపించారు. ఖమేనీ స్మృత్యర్థం కోమ్ నగరంలో కూడా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖమేనీ అంత్యక్రియలపై తొలి నుంచీ కొంత సందిగ్ధత నెలకొంది. జూన్‌లో అంత్యక్రియలు పూర్తవుతాయని మొదట్లో వార్తలు వెలువడ్డాయి. అయితే, జులైలో ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రభుత్వ మీడియా ఇటీవల ధ్రువీకరించింది. అంత్యక్రియలకు దాదాపు 20 మిలియన్ల మంది హాజరుకానున్నట్టు ఇరాన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ కూడా ఇరాన్‌కు వెళ్లే అవకాశం ఉంది. ఇక అయతొల్లా ఖమేనీ అనంతరం ఆయన కుమారుడు మొజ్తాబా ఖమేనీ ప్రస్తుతం ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఉన్నారు. అయితే, ఆయన ఎక్కడున్నారనే దానిపై స్పష్టత లేదు. మొజ్తాబా ఆరోగ్యంపై కూడా పలు వార్తలు వెలువడ్డాయి. ఆయన కోమాలో ఉండే అవకాశం ఉందని సీనియర్ యూఎస్ అధికారులు పలుమార్లు తెలిపారు.

# జైపూర్‌లో విషాదం.. గోడ కూలడంతో ముగ్గురు కార్మికుల మృతి

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

రాజస్థాన్ జైపూర్‌లోని చందవాజీ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఓ భవనం గోడ అకస్మాత్తుగా కూలిపోవడంతో ముగ్గురు కార్మికులు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. కాగా.. కూలీలతో సహా 12 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకుపోయి ఉంటారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బేస్మెంట్‌లో ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో గోడ ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు శిథిలాల్లో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు అధికారులు. శిథిలాల్లో చిక్కుకున్న మరి కొందరు కార్మికుల కోసం రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. స్థానిక జిల్లా కలెక్టర్ సందేశ్ నాయక్ సహా ఇతర ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

# గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది: శివరాజ్‌సింగ్

న్యూఢిల్లీ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందన్నారు. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఏసీవై రహదారుల పనులు వేగవంతం కావాలని పేర్కొన్నారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి మంత్రితోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

### నిధుల వాటా విడుదల చేయండి: శివరాజ్ సింగ్

అలాగే గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కోరారు.

### ఏపీపై కేంద్ర మంత్రి ప్రశంసలు..

గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్ఎంఏజీఐ (ఎదీ+=హీూజీ×)కి నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. జాతీయ ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (ూవీ+హ్) నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ వివరించారు.

# 'అయోధ్య విరాళాల కేసు నిందితుల తరఫున ఎవరూ వాదించొద్దు'

ఇంటర్నెట్ డెస్క్:

అయోధ్య బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో అరెస్టైన ఎనిమిది మంది నిందితుల తరఫున తమ సంఘానికి చెందిన ఏ న్యాయవాదీ కోర్టులో వాదించరాదని బార్ అసోసియేషన్ సోమవారం సంచలన తీర్మానం చేసింది. ఈ నిర్ణయాన్ని ఉల్లంఘించే న్యాయవాదులపై రూ.5 లక్షల జరిమానా విధిస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాళికా శరణ్ మిశ్రా స్పష్టం చేశారు. నిందితులను స్థానిక కోర్టులో హాజరుపరిచిన రోజే నిర్వహించిన బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించారు. రామాలయానికి భక్తులు సమర్పించిన కానుకల దుర్వినియోగం ఆరోపణలు.. తమ మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని బార్ అసోసియేషన్ తెలిపింది. అందువల్లే సభ్యులంతా ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. భవిష్యత్తు కార్యాచరణపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామంది. ఇదే సమావేశంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా, ఆలయ నిర్మాణ ఇన్‌ఛార్జి గోపాల్‌రావుపై కేసు నమోదు చేయాలని కూడా బార్ అసోసియేషన్ తీర్మానించింది. వీరంతా మరో మూడు రోజుల్లో అయోధ్యను వీడాలని, లేనిపక్షంలో నగరమంతా బంద్ చేపట్టి, ఆలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించింది. కాగా.. 2005లో రామ జన్మభూమి తాత్కాలిక ఆలయంపై జరిగిన ఉగ్రదాడి కేసులోనూ నిందితుల తరఫున వాదించబోమని నాడు ఇదే బార్ అసోసియేషన్ ప్రకటించింది.

# భారత ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో పుంజుకుంది

## డేటా ఆధారిత నిర్ణయాలే 'వికసిత్ భారత్'కు పునాది ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా

ఢిల్లీ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

భారత ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో పుంజుకుందని ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రమోద్ కుమార్ మిశ్రా స్పష్టం చేశారు. ఇటీవల విడుదలైన త్రైమాసిక, వార్షిక స్థూల దేశీయోత్పత్తి గణాంకాలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో ఇవాళ జరిగిన 20వ జాతీయ గణాంక దినోత్సవం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం పటిష్ఠమైన రికవరీని సాధించిందని మిశ్రా అన్నారు.

### డేటా ఆధారిత నిర్ణయాలే 'వికసిత్ భారత్'కు పునాది

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయం సాక్ష్యాధారాలు, కచ్చితమైన డేటా ఆధారంగానే ఉంటుందని పీకే మిశ్రా వివరించారు. 'మనం సాధించే ప్రగతిని, పథకాల అమలును నిరంతరం కొలవడానికి డేటా ఎంతో అవసరం. 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్)



లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ డేటా ఆధారిత నిర్ణయాలే దిక్సూచిగా మారనున్నాయి' అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం.. ప్రభుత్వ శాఖలు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా భారీ మొత్తంలో డేటా అందుబాటులోకి వస్తోందని మిశ్రా చెప్పారు. వివిధ మంత్రిత్వ శాఖల డిజిటల్ కార్యకలాపాల ద్వారా జనరేట్ అవుతున్న డేటాను సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం పలు అంశాలపై దృష్టి సారించిందని మిశ్రా తెలిపారు. విభిన్న శాఖల డేటాను ఒకదానితో ఒకటి అనుసంధానించేలా చేయడం, సంప్రదాయ సర్వే డేటాతో ఈ అడ్మినిస్ట్రేటివ్ డేటా సరిపోలేలా నాణ్యతను మెరుగుపరచడం, అధికారిక గణాంకాల పరిధిని విస్తృతం చేస్తూ నమ్మకమైన సమాచారాన్ని అందుబాటులోకి తేవడం వీటి ప్రధాన ఉద్దేశమని మిశ్రా వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర, మానవ వనరులు నిర్ణయాలను మరింత సమగ్రంగా, వేగంగా తీసుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత అద్భుతమైన అవకాశాలను కల్పిస్తుందని మిశ్రా అభిప్రాయపడ్డారు. అయితే, అదే సమయంలో సాంకేతికతను సరిగ్గా ఉపయోగించుకునేలా మానవ వనరుల సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందించే ఫలితాలను క్షేత్రస్థాయిలో సరిచూసుకోవడం కూడా అంతే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

# వర్షం ఎఫెక్ట్.. మధిర రైతు ఆశీర్వాద సభ రద్దు.. హైదరాబాద్‌కు షిఫ్ట్

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

ఖమ్మం జిల్లా మధిరలో రేపు(మంగళవారం) జరగాల్సిన రైతు ఆశీర్వాద సభ రద్దైంది. వర్షాల కారణంగా సభ నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో మధిరలో జరగాల్సిన సీఎం రేవంత్ రెడ్డి సభలో మార్పులు చేశారు. రేపు సాయంత్రం హైదరాబాద్ శిల్పకళా వేదికలో రైతుభరోసా పంపిణీ సదస్సు నిర్వహించనున్నారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి.. రైతుభరోసా నిధులను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని మంత్రులు, అధికారులను సీఎం ఆదేశించారు. మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో రేపు రైతు ఆశీర్వాద సభ జరగాల్సి ఉంది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై.. రైతుభరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. దాదాపు లక్ష మందితో సభ నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుని... అందుకు తగ్గట్టుగా జగన్నాథపురంలో ఏర్పాట్లు చేశారు. అయితే, రెండు రోజులుగా కురుస్తున్న భారీగా వర్షాలకు సభా ప్రాంగణంలో పెద్దఎత్తున వరద నీరు చేరుకుంది. దీంతో సభ నిర్వహించేందుకు అవకాశం లేదని మంత్రులు, సీఎంవో కార్యాలయానికి జిల్లా అధికారులు తెలియజేశారు. దీంతో ప్రభుత్వం మధిరలో సభను రద్దు చేసి.. సభా వేదికను హైదరాబాద్‌కు మార్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రైతులు తమ తమ రైతు వేదికల నుంచి ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

# ఏరువాక పౌర్ణమి తెలంగాణ రైతుల సంస్కృతికి ప్రతీక.. మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట జిల్లా, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

ఏరువాక పౌర్ణమి తెలంగాణ రైతుల సంస్కృతికి ప్రతీక అని మంత్రి పొన్నం ప్రభాకర్ (ఐశ్రీఖఅస్త్రుఖఖ వీఱఅఱర్‌వతీ ౢాశీఅఖఎ ౢాతీఖఎష్ట్రుఙ్ఖతీ) వ్యాఖ్యానించారు. రైతులందరికీ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు (సోమవారం) హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలంలోని కూరెల్ల గ్రామంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని రైతులతో కలిసి మంత్రి పొన్నం దుక్కి దున్ని విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు పడి పాడి పంటలతో ఆయురారోగ్యాలతో రైతులు ఉండాలని మంత్రి పొన్నం ఆకాంక్షించారు. అన్నదాతలు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. అందుకే తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ నాణ్యమైన విత్తనాలను మాత్రమే అన్నదాతలు వినియోగించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతన్నలు ముందుకు సాగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# దూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని మా అనుమానం: కవిత

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) జరిగిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని.. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈరోజు (సోమవారం) హైదరాబాద్ వేదికగా కవిత మీడియాతో మాట్లాడారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని.. వీటిని తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందని ప్రస్తావించారు.

### రాష్ట్రంలో దూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయి..

సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో కేవలం 800 ఓట్లు మాత్రమే తొలగించారని కవిత అన్నారు. కొడంగల్‌లో తాము వెరిఫై చేస్తే 33వేల దూప్లికేట్ ఓట్లు ఉన్నాయని వచ్చాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో దూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయని తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి 32వేల మెజారిటీతో గెలిచారని అన్నారు. ఈ దూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని తమకు అనుమానం ఉందని చెప్పారు. కర్ణాటక నుంచి నోటు ట్రాన్స్‌ఫర్‌తో పాటు ఓటు ట్రాన్స్‌ఫర్ అయిందా అనే అనుమానం తమకు కలుగుతోందని కవిత పేర్కొన్నారు.



### రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను పరిశీలించాలి..

ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. 'సర్' దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను వెంటనే పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లకు ఏపీలో కూడా ఓటు ఉందని... ఎక్కడైనా ఒక చోటు మాత్రమే ఓటు ఉండేలా చూడాలని సూచించారు. ఇంటర్ స్టేట్ దూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు. ఎన్నికల సంఘానికి ఈ విషయాలపై ఫిర్యాదు చేస్తామని కవిత పేర్కొన్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో లేజర్ లైట్ల కలకలం..

హైదరాబాద్:

శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం అర్ధరాత్రి లేజర్ లైట్లు కలకలం రేపాయి. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి వస్తున్న లుఫ్తాన్సా విమానం హైదరాబాద్‌కు చేరుకుని ల్యాండింగ్‌కు సిద్ధమైంది. అయితే, అదే సమయంలో లేజర్ లైట్లు విమానం కాక్‌పిట్ వైపు ప్రసరించాయి. పైలట్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా విమానం సురక్షితంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయింది. లేజర్ కాంతులు పైలట్ల దృష్టిని తాత్కాలికంగా దెబ్బతీసే అవకాశం ఉంది. ల్యాండింగ్ సమయంలో ఇది అత్యంత ప్రమాదకరం. దీంతో ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన పైలట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అధికారులకు సమాచారం అందించారు. పైలట్ ఫిర్యాదు మేరకు విమానాశ్రయ అధికారులు, భద్రతా విభాగాలు ఘటనపై దర్యాప్తు ప్రారంభించాయి. లేజర్ లైట్లు ఏ ప్రాంతం నుంచి ప్రసరించాయనే అంశంపై సీసీటీవీ ఫుటేజ్‌తో పాటు ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. విమానాల టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో లేజర్ లైట్ల వినియోగం అత్యంత ప్రమాదకరమని ఏటీసీ అధికారులు చెబుతున్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# జీవితం.. వందమీటర్ల పరుగుపందెం కాదు.. మన ఓపికకు పరీక్ష : నితిన్ నబీన్

హైదరాబాద్:

రాజకీయాల్లోకి వచ్చాక తన భవిష్యత్తుపై గందరగోళంలో పడ్డానని బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలిపారు. చిన్నవయసులోనే అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏ పని చేసినా తనదైన ముద్ర ఉండాలని గట్టిగా అనుకున్నానని, జీవితం వందమీటర్ల పరుగుపందెం కాదని, మన ఓపికకు పరీక్షని తెలియజేశారు. అప్పగించిన పనిని నిబద్ధతతో పూర్తి చేయడమే తన బలం అని వేగంగా లక్ష్యాలు చేరాలనే ఆరాటంలో నేటి యువత ఉందని నితిన్ నబీన్ పేర్కొన్నారు. ఏ పనినైనా, ఓపిక, నిలకడ, శక్తితో చేసినప్పుడే ఫలితాలు వస్తాయని, నేటి యువత ఎప్పుడూ వాస్తవికత గుర్తించి పనిచేయాలని సూచించారు. రీల్స్, షార్ట్స్ చూసి ఎవరూ నిర్ణయాలు తీసుకోవద్దు అని జీవితంలో నిర్ణయం తీసుకునేందుకు సమయం తీసుకోండని సూచించారు. వాస్తవికత ఆధారంగా నిర్ణయాలు తీసుకోండని..పని మొదలుపెట్టండని, యువత..రాజకీయాల్లోకి రావాలని, వచ్చాక ఏం చేస్తారో స్పష్టత ఉండాలని అన్నారు. గతంలో తమ హక్కుల గురించి ప్రజలకు అంతగా తెలిసేది కాదని, సోషల్ మీడియా వచ్చాక ప్రజల్లో చైతన్యం పెరిగిందని చెప్పారు. హక్కుల, విధుల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని, పార్టీలు, నాయకులు ఇచ్చిన హామీలను ప్రజలు గుర్తుంచుకుంటారని నితిన్ నబీన్ స్పష్టం చేశారు.

# 235కు చేరిన భూకంప మృతుల సంఖ్య

## క్రమంగా పెరుగుతోన్న మృతుల సంఖ్య

## ఇంకా దొరకని 40వేల మంది ఆచూకీ

## భవన శిథిలాల కింద అనేక మంది!?

## వెనెజువెల వ్యాప్తంగా తీవ్ర విధ్వంసం

## సహాయం కోసం ముందుకొచ్చిన దేశాలు



**కారకాస్,**

దక్షిణ అమెరికా దేశమైన వెనెజువెలాను భారీ భూకంపాలు వణికించాయి. సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు శక్తిమంతమైన భూప్రకంపనలతో దేశవ్యాప్తంగా తీవ్ర విధ్వంసం చోటుచేసుకుంది. ఈ ప్రకృతి విపత్తులో మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పటివరకు 235 మంది మృతి చెందినట్లు వెనెజువెలా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. మరో 4,300 మంది గాయపడినట్లు తెలిపింది. అనేక మంది భవన శిథిలాల కింద చిక్కుకుపోవడంతో సహాయక బృందాలు వారిని వెలికితీసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నాయి. అధికారుల సమాచారం ప్రకారం, ఈ వరుస భూకంపాల అనంతరం దాదాపు 40 వేల మంది ఆచూకీ తెలియడం లేదు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. రాజధాని కారకాస్‌తో పాటు దేశంలోని పలు ప్రధాన నగరాల్లో భూప్రకంపనలు సంభవించినప్పటికీ, తీర ప్రాంత నగరమైన లా గువేరాలో అత్యధిక నష్టం వాటిల్లింది. భూకంపం ధాటికి అక్కడి పరిస్థితి దయనీయంగా మారింది. ఐక్యరాజ్యసమితి ప్రతినిధుల వివరాల ప్రకారం, లా గువేరాలో 100కు పైగా భవనాలు పూర్తిగా కూలిపోయాయి. శిథిలాల కింద చిక్కుకున్నవారిని గుర్తించడం, వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం అత్యంత క్లిష్టంగా మారిందని వారు తెలిపారు. భారీ కాంక్రీట్ శిథిలాలను తొలగించేందుకు ప్రత్యేక యంత్రాలను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా సుమారు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా నేలమట్టమైనట్లు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ తెలిపారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని శాఖలను అప్రమత్తం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ విపత్తు సమయంలో తమ దేశానికి అండగా నిలిచిన ప్రపంచ దేశాలకు డెల్సీ రోడ్రిగ్స్ కృతజ్ఞతలు తెలిపారు. మానవతా దృక్పథంతో సహాయక చర్యల్లో భాగస్వాములవుతున్న అన్ని దేశాలకు వెనెజువెలా ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ప్రపంచ దేశాలు చూపుతున్న సంఘీభావం తమకు ఎంతో ధైర్యాన్ని ఇస్తోందని ఆమె అన్నారు.భూకంపం అనంతరం సమాచార మార్పిడిని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించిన ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు, సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని వెనెజువెలా ప్రభుత్వాన్ని కోరారు. అత్యవసర సమాచారాన్ని ప్రజలకు త్వరగా చేరవేయడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందని సూచించారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వెనెజువెలాలో 'ఎక్స్' సామాజిక మాధ్యమ వేదికను మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది. 2024లో అప్పటి ప్రభుత్వం ఈ మైక్రోబ్లాగింగ్ వేదికపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, వెనెజువెలాకు అంతర్జాతీయంగా భారీగా సహాయం అందుతోంది. అమెరికా 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని పంపనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసినట్లు తెలిపింది. స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్, మెక్సికో, బ్రెజిల్ తదితర దేశాలు కూడా వైద్య బృందాలు, సహాయక సిబ్బంది, అత్యవసర సామగ్రిని పంపేందుకు ముందుకొచ్చాయి. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్నవారిని సజీవంగా రక్షించేందుకు సహాయక బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న ప్రభుత్వం, బాధితులకు అవసరమైన అన్ని విధాల సహాయాన్ని అందించేందుకు చర్యలు చేపడుతోంది.

# ఆదానీ లంచం కేసులో ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం

### కేసు ఉపసహంరణకు నివేదిక ఇవ్వాలని జడ్జి ఆదేశం

**న్యూయార్క్,**

బిలియనీర్ గౌతమ్ అదానీ పై నమోదైన హై-ప్రొఫైల్ లంచం కేసులో అమెరికా ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అదానీతోపాటు ఇతర నిందితులపై ఉన్న క్రిమినల్ ఆరోపణలను తక్షణమే కొట్టివేసేందుకు ఫెడరల్ జడ్జి నిరాకరించారు. ఈ కేసును ఎందుకు ఉపసంహరించుకోవాలని అనుకుంటున్నారో తెలుపుతూ మరింత స్పష్టమైన, వివరణాత్మకమైన నివేదికను సమర్పించాలని అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్‌ను కోర్టు ఆదేశించింది. బ్రూక్లిన్ లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి నికోలస్ గరాఫిస్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కేసును ఉపసంహరించుకోవాలంటూ మే 18న జస్టిస్ డిపార్ట్‌మెంట్ దాఖలు చేసిన పిటిషన్ చాలా క్లుప్తంగా, ఎలాంటి బలమైన కారణాలు లేకుండా ఉందంటూ ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. కేసును ఎందుకు డ్రాప్ చేయాలనుకుంటున్నారో సరైన ఆధారాలు, కారణాలతో కూడిన నివేదికను జూలై 13 లోగా కోర్టుకు సమర్పించాలని ప్రాసిక్యూటర్లను ఆదేశించారు. భారత్‌లో సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఆమోదం కోసం ప్రభుత్వ అధికారులకు వందల మిలియన్ డాలర్ల లంచాలు ఇవ్వడానికి ప్రయత్నించారని, అలాగే అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించారని గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీపై 2024లో అమెరికాలో కేసు నమోదైంది. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ మొదటి నుంచీ తీవ్రంగా ఖండిస్తూ వస్తోంది. మే నెలలో ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ కేసుపై మరింత సమయం, వనరులను కేటాయించలేమని పేర్కొంటూ కేసును పూర్తిగా ఉపసంహరించుకోవాలని జస్టిస్ డిపార్ట్‌మెంట్ భావించింది. జూన్ 24న అదానీ తరపు న్యాయవాదులు కూడా ఈ కేసు అమెరికా అధికార పరిధిలోకి రాదని, లంచం ఇచ్చినట్లు నిరూపించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ కేసును అధికారికంగా కొట్టివేయాలని కోర్టును కోరారు. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకునే ముందు ప్రభుత్వం నుంచి పూర్తి వివరణ కావాలని న్యాయమూర్తి స్పష్టంచేశారు. ఈ క్రిమినల్ కేసు ప్రక్రియ ఇలా ఉండగా.. దీనికి సమాంతరంగా నడుస్తున్న సివిల్ వివాదాల పరిష్కారానికి అదానీ గ్రూప్ అంగీకరించింది. ఇందులో భాగంగా గౌతమ్ అదానీ 6 మిలియన్ డాలర్లు, సాగర్ అదానీ 12 మిలియన్ డాలర్ల మేర సివిల్ సెటిల్‌మెంట్ కింద చెల్లించే ప్రతిపాదనలు కోర్టు అనుమతి కోసం వేచి ఉన్నాయి. ఇవి కాకుండా ఇరాన్ నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ దిగుమతులకు సంబంధించి అమెరికా ఆంక్షలను ఉల్లంఘించారనే ఆరోపణల పరిష్కారానికిగాను అదానీ ఎంటర్‌ప్రైజెస్ అమెరికా ట్రెజరీకి 275 మిలియన్ డాలర్లు చెల్లించడానికి ఒప్పుకుంది.

# వచ్చే ఏడాది ఆరంభంలో భారత్‌కు ట్రంప్

### ధృవీకరించిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో

### భారత్ -యూఎస్ బంధం బలోపేతం అంటూ కితాబు



**వాషింగ్టన్,**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది ఆరంభంలో భారత పర్యటనకు వచ్చే అవకాశం ఉందని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో వెల్లడించారు. ట్రంప్ భారత్ పర్యటన కోసం ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించామని, ఈ ఏడాది చివర్లో తాను భారత్‌కు వచ్చి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షిస్తానని తెలిపారు. భారత్-అమెరికా మధ్య సంబంధాలు అద్భుతమంటూ కొనియాడారు. అధ్యక్షుడి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఖరారు చేయడానికి ఈ ఏడాది ముగిసేలోపే తాను భారత్‌కు వెళ్తానని పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ మొదటి భారత పర్యటన ఇదే కానుంది. అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అని.. ప్రధాని నరేంద్ర మోదీ- ట్రంప్ మధ్య మంచి అనుబంధం ఉందని మార్కో రూబియో తెలిపారు. దౌత్యపరంగా వారి బంధం చాలా ఉపయోగకరమన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సులో వాణిజ్య ఒప్పందం గురించి మోదీ-ట్రంప్ చర్చించారని రూబియో వెల్లడించారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు త్వరలో పూర్తి కానున్నట్లు తెలిపారు. ఇంధన సరఫరాను పెంచడానికి భారత్-అమెరికా కలిసికట్టుగా పనిచేస్తున్నాయన్నారు. చమురు శుద్ధి చేయగల సామర్థ్యం ఉన్న కొన్ని దేశాలలో భారత్ కూడా ఒకటని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై రూబియో ప్రశంసలు కురిపించారు. తాను ఆయనకు అభిమానినని తెలిపారు. ప్రపంచ వేదికపై భారతదేశ స్థాయిని పెంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మోదీ భారత్‌ను ఒక ప్రపంచ శక్తిగా మార్చారని కొనియాడారు. భారత్-అమెరికా బంధం ప్రస్తుతం ఎంతో బలంగా ఉందని మార్కో రుబియో పేర్కొన్నారు. వైట్ హౌస్‌లో ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రుబియో మాట్లాడారు. 'వచ్చే ఏడాది ప్రారంభంలో అధ్యక్షుడు ట్రంప్, భారత్ పర్యటనకు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. అదే మా లక్ష్యం' అని చెప్పారు. అలాగే, అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఉన్న స్నేహం ద్వైపాక్షిక బంధాలను మరింత బలోపేతం చేస్తోందని వ్యాఖ్యానించారు. లాగే ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని కూడా రుబియో తెలిపారు . ఈ ఒప్పందం త్వరలోనే ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయని, దీనివల్ల భారత్-అమెరికా ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే క్వాడ్ దేశాల నేతల సమావేశం కూడా త్వరలో నిర్వహించాలని అమెరికా ఎదురుచూస్తోందని చెప్పారు.

# దర్యాపూర్ ఆదర్శ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచారం, జూన్ 29**

ముత్తారం మండలంలోని దర్యాపూర్ తెలంగాణ ఆదర్శ పాఠశాల ద జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ రాపెల్లి రాజయ్య హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యే సమాజ అభివృద్ధికి మూలాధారమని, ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పాఠశాల ప్రిన్సిపాల్ డా. సంతోష్ కుమార్ కేసరి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు పుస్తకాలను జాగ్రత్తగా సంరక్షించుకుని విద్యాభ్యాసంలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# నాలుగు జిల్లాల తలరాత మార్చే వెలిగొండ

### భూములు ఇచ్చిన రైతులు త్యాగం మరువలేనిది

### తొలివిడతలో నిర్వాసితులకు 300 కోట్ల పరిహారం

### కృష్ణాజలాలు వస్తాయని ఎవ్వరూ ఊహించలేదు

### గత ప్రభుత్వ పూర్తిచేయకుండానే ప్రారంభోత్సవం

### వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు

### నిర్వాసిత రైతులతె సిఎం చంద్రబాబు భేటీ

**మార్కాపురం**

నాలుగు జిల్లాల తలరాతలు మార్చే ప్రాజెక్టు వెలిగొండ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు వృథా కావని చంద్రబాబు అన్నారు. మార్కాపురం జిల్లా పర్యటనలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించిన అనంతరం నిర్వాసితులు, లబ్దిదారులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శనివారం దోర్నాల మండలం గంటావానిపల్లిలో వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులు, రైతులతో సీఎం సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. నీళ్లు లేక చాలా మంది ఫ్లోరైడ్ వాటర్ తాగుతున్నారని.. కృష్ణా నదీ జలాలు ఈ ప్రాంతానికి వస్తాయని ఎవరూ ఆలోచన చేసి ఉండరని తెలిపారు. రాయలసీమ, మార్కాపురం ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకురావాలని ఎన్టీఆర్ ఆలోచన చేశారని గుర్తుచేశారు.1996 మార్చి 26న వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించామని.. రూ.900 కోట్లు పునరావాసం కోసం కేటాయించామని అన్నారు. రూ.300 కోట్లు మొదటి విడతలో నిర్వాసితులకు ఇస్తున్నామని చెప్పారు. ఏపీలో చాలా ఇబ్బందులు ఉన్నాయని సీఎం అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వొచ్చు. సుంకేశుల గ్యాప్ పనులను 1998లోనే ప్రారంభించాం. గత ప్రభుత్వాలు కూడా మాలాగే చేసుంటే పరిస్థితి మరోలా ఉండేది. మార్కాపురం జిల్లాలో పండ్ల తోటలు బాగా రావాలన్నారు. భూములు ఇచ్చిన రైతుల త్యాగం గొప్పది. మీరు ఇచ్చిన భూముల వల్ల నాలుగైదు జిల్లాలు బాగుపడతాయి. వెలిగొండ నీళ్లు వచ్చాక చుట్టుపక్కల భూముల విలువ పెరుగుతుంది. మాది ప్రజా ప్రభుత్వం.. అందరికీ లబ్ది చేకూరుస్తాం. కరవు జిల్లా పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని సీఎం తెలిపారు.మోసాలు చేయడంలో గొడ్డలి పార్టీ నేతలు దిట్ట. వైకాపా నేతలు కళ్లు ఆర్పకుండానే అబద్దాలు చెబుతున్నారు. ఆ పార్టీ నేతలు ఇప్పుడు వితండవాదం చేస్తున్నారు. వెలిగొండ పేరుతో వైకాపా ప్రభుత్వం అనేక మోసాలు చేసింది. టన్నెల్-2లో బోరు ఇరుక్కు పోయినా ప్రాజెక్టును ప్రారంభించేశారని మండిపడ్డారు. నక్సలిజంపై పోరాటం చేశానని.. క్లైమోర్ బాంబులు పెడితే వేంకటేశ్వరస్వామి తనను కాపాడారన్నారు. గత పాలకులు రూ.10 లక్షల కోట్లు అప్పులు పెట్టిపోయారని విమర్శించారు. 3,351 వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు రూ.300 కోట్లు జమ చేశామన్నారు. నిర్వాసితుల త్యాగం వృథా కాదని.. అందరికంటే మెరుగైన జీవితం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుపై ఈ టర్మ్‌లో రూ.3,900 కోట్ల వ్యయం అవుతోందన్నారు. 2027 నాటికి మిగిలిన పనులన్నీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫేజ్-1, ఫేజ్-2 పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇడుపూరు, గోగులదిన్నె, తోకపల్లి తదితర పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి చేశామన్నారు. మార్కాపురానికి ప్రత్యేక జిల్లా ఇచ్చామని.. కలెక్టరేట్ కూడా పునరావాస కాలనీ పక్కనే వస్తుందని తెలిపారు. పునరావాస కాలనీ భవిష్యత్తులో ఆదర్శ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందుతుందని అన్నారు.4.47 లక్షల ఎకరాలకు సాగునీరు.. 23 లక్షల మందికి

తాగునీరు అందేలా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని సీఎం తెలిపారు. 43.5 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. సుంకేసుల, గొట్టిపడియ డ్యామ్‌లకు రూ.120 కోట్ల పరిపాలనా అనుమతి ఇచ్చామని.. రూ.98 కోట్లతో సుంకేసుల పనులను ప్రారంభించినట్లు చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే వెలిగొండ ఆలస్యమైందని విమర్శించారు. పదేళ్ల ముందే ప్రాజెక్టు పూర్తయి ఉంటే రైతుల జీవితాలు మారిపోయేవన్నారు. గొడ్డలి పార్టీ మోసాలు డిజిటల్ మోసాలుగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు డ్రామాలు, మోసాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. డిజిటల్ అరెస్ట్ మోసాల తరహాలో వైసీపీ మోసాలు అంటూ దుయ్యబట్టారు. 2024లో కేటాయించిన నిధులను గత ప్రభుత్వం సరిగా వినియోగించలేదన్నారు. టన్నెల్-2లో యంత్రం చిక్కుకుపోయినా తొలగించకుండా ప్రారంభోత్సవం చేశారని విమర్శించారు. నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టం జరగనివ్వమని.. బాధిత రైతులందరికీ న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో నాలుగు జిల్లాల అభివృద్ధి, భూముల విలువ పెరుగుతుందని చెప్పారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి పూర్తి న్యాయం చేస్తామన్నారు. వెలిగొండ పెండింగ్ బిల్లులన్నీ చెల్లించామని తెలిపారు. మార్కాపురం జిల్లాకు కరువు పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని.. ఈ ప్రాంతంలో హార్టికల్చర్‌కు పెద్దపీట వేస్తామన్నారు. మార్కాపురాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని అన్నారు. హార్టికల్చర్ అభివృద్ధికి రూ.1 లక్ష కోట్ల ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రూ.40 వేల కోట్లు ప్రభుత్వం, రూ.60 వేల కోట్లు ప్రైవేట్ పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎఫ్‌పీఓల ద్వారా రైతుల ఆదాయం పెంచే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.రామాయపట్నం పోర్టు, ఎయిర్‌పోర్ట్‌తో ఎగుమతులకు అవకాశముందని సీఎం అన్నారు. రోడ్లు, రైల్వే కనెక్టివిటీతో ప్రాంత అభివృద్ధి వేగవంతం చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తున్నామని.. మైక్రో ఇరిగేషన్‌కు మళ్లీ ప్రోత్సాహం అందిస్తామన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.24 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. హంద్రీ-నీవా పూర్తి చేసి చివరి ప్రాంతాలకు నీళ్లు అందించామని వెల్లడించారు. పోలవరం ఆలస్యం వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందన్నారు. అమరావతిని నిలిపివేయడం రాష్ట్రానికి నష్టమన్నారు. 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్ర అభివృద్ధికి రాజధాని అత్యంత కీలకమన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం హైదరాబాద్‌ను తీర్చిదిద్దామని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు మారతాయని ధీమా వ్యక్తం చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామ న్నారు. కులం, మతం ఆధారంగా కాకుండా అభివృద్ధిని చూసి ఓటు వేయాలని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలోనే మార్కాపురం అభివృద్ధి జరిగిందని చంద్రబాబు తెలిపారు. తుంగభద్ర డ్యాం గేట్ల మరమ్మతులతో నీటి వృథాను అడ్డుకున్నామన్నారు. 33 కొత్త గేట్లను ఏర్పాటు చేసి ముగ్గురు ముఖ్యమంత్రులం జాతికి అంకితం చేశామని తెలిపారు. గంగా, కావేరి నదుల అనుసంధానం అవసరమన్నారు. దేశంలో విద్యుత్ గ్రిడ్ వ్యవస్థతో విద్యుత్ కొరత సమస్య తగ్గిందని చెప్పారు. సెల్‌ఫోన్ విప్లవం వల్ల ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయన్నారు. రైతుల్లో అభివృద్ధి దిశగా ఆలోచనా విధానం మారాలని సూచించారు. 2027 కల్లా పోలవరం పూర్తి చేస్తామని ప్రకటించారు. అక్కడి నుంచి నల్లమల సాగర్‌కు నీళ్లు తీసుకువస్తామన్నారు. అవసరమైతే నల్లమల సాగర్ నుంచి లిఫ్ట్ పెట్టి కావేరికి కూడా నీళ్లు ఇవ్వొచ్చన్నారు. దీని వలన ఐదు నదులు అనుసంధానం అవుతాయని.. నాలుగు రాష్ట్రాలు బాగుపడ తాయని చెప్పుకొచ్చారు.

PRGI NO: TGTEL/25/A5314
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
ఎడిటర్ : లింగం రాజయ్య
బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

# సంపాదకీయం...

## ఢిల్లీ కాదు.. నేరాల గల్లీ

దేశ రాజధాని ఢిల్లీలో 2012లో జరిగిన నిర్భయ సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన సంగతి తెలిసిందే. 2012 డిసెంబరు 16న 23 ఏళ్ల వైద్య విద్యార్థినిని కదులుతున్న బస్సులో ఆరుగురు దుండగులు దారుణంగా ఇనుపకడ్డీతో కొట్టి అత్యాచారం చేయడం, తల, పేగులకు తగిలిన గాయాలతో 13 రోజులు ఆమె మృత్యువుతో పోరాడి మృతి చెందడం ఢిల్లీ చరిత్రకు తీరని కళంకం తెచ్చిపెట్టింది. ఈ సంఘటనకు స్పందించి దేశంలో మహిళల గౌరవాన్ని కాపాడడానికి, భద్రతను నిర్ధారించే కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడానికి 2013లో కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం రూ. 1000 కోట్ల కార్పస్ నిధిని ప్రకటించింది. ఈ సంఘటన క్రూర నేర నివారణ చట్టాల్లో సవరణలకు కూడా దారి తీసింది.

అయినాసరే మహిళలపట్ల క్రూరమైన నేరాలు తగ్గడం లేదు. అత్యాచారాల రాజధానిగా ఢిల్లీకి తీరని ముద్రపడే సంఘటన గత సోమవారం వెలుగులోకి వచ్చింది. దక్షిణ ఢిల్లీలోని వలస కార్మికుని 11 ఏళ్ల కూతురు ఫుట్‌పాత్‌పై నిద్రిస్తుండగా, 24 ఏళ్ల క్యాబ్ డ్రైవర్ ఆమెను కిడ్నాప్ చేసి హత్యాచారానికి పాల్పడ్డాడు. నేరం జరిగిన ప్రదేశంలో జరిగిన సంఘటనను పోలీసులు మళ్లీ నమూనాగా ప్రదర్శిస్తున్న సమయంలో తప్పించుకోడానికి ప్రయత్నిస్తున్నాడన్న ఆరోపణలతో ఆ నిందితుని కాళ్లపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ సంఘటన రాజధానికి చెడ్డపేరు తీసుకు రావడమే కాక, వలస కార్మికుల కుటుంబాలకు ఢిల్లీలో ఎలాంటి భద్రత లేదన్న భయాన్ని కూడా కలిగిస్తోంది. స్వస్థలాన్ని విడిచిపెట్టి పొట్ట చేత పట్టుకుని కూలి పనుల కోసం పట్టణాలు, నగరాలకు వలసపోయే బడుగువర్గాలకు ఇలాంటి దారుణాలు జరిగితే ఎవరు దిక్కు? ఒంటరిగా బతుకుతూ భాషా సమస్య వల్ల ఎవరికీ తమ సమస్యలను తెలియజేయలేక తరచుగా ఇబ్బందులు పడే వలస కార్మికులు స్వదేశం లోనే రెండో తరగతి పౌరులుగా బతుకుతున్నారు. అయోధ్య ఆలయానికి అంటిన అవినీతి అసంఘటిత రంగ వలస కార్మికుల బతుకులకు ఆసరా కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ఈశ్రమ్ పోర్టల్ అనే జాతీయ డిజిటల్ పోర్టల్‌ను ప్రారంభించింది. దీని ద్వారా అర్హులైనవారికి రూ. 2 లక్షల ప్రమాద బీమా, సామాజిక భద్రత, వివిధ ప్రభుత్వ ప్రయోజనాలు అందుతాయి. 2025 నవంబర్ ఆఖరికి 31.4 కోట్ల మంది అసంఘటిత కార్మికులు ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదయ్యారంటే సమాజంలో అసంఘటిత కార్మికుల కష్టనష్టాలు ఏ స్థాయిలో ఉన్నాయో స్పష్టం అవుతుంది. ఈ శ్రమ్ కార్డు ఉన్న వారికి శాశ్వత వైకల్యం కలిగినా, మరణం సంభవించినా కేంద్ర ప్రభుత్వం రూ. 2 లక్షల వరకు బీమాను అందిస్తుంది. పాక్షిక వైద్యానికి రూ. 1 లక్ష అందిస్తుంది. ఇదంతా బాగానే ఉన్నా ఎంతవరకు ఈ పోర్టల్ పై వలస కార్మికులకు అవగాహన ఉందో చెప్పలేం. క్షేత్రస్థాయిలో ఈ పోర్టల్ వాస్తవంగా అందుబాటులోకి వస్తే వారికి మేలు చేసిన వారవుతారు. ఢిల్లీలో జరిగిన దారుణాలు వంటి ఘోరాలకు అసంఘటిత కార్మికులు బలికాక తప్పదు. దేశం లోని అనేక ప్రాంతాల్లో వలస కార్మికులు కనీస వేతనాలు లేక, వసతులు లేక నిర్బంధంగా పనులు చేస్తున్నారు.

# రైతుల సౌకర్యార్థం నీరుకులలో పెట్రోల్ బంకు ప్రారంభం

## అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ విజయరమణారావు శ్రీకారం

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచారం, జూన్ 29





సుల్తానాబాద్ మండలం నీరుకుల గ్రామంలో సహకార వారోత్సవాల సందర్భంగా సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కన్స్యూమర్ ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్, డీజిల్ బంకు)ను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రారంభించారు. అనంతరం గ్రామంలో సుమారు రూ.30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముందు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని 14 సహకార సంఘాల్లో 11 సంఘాలను ఏకం చేసి ఎలిగేడు మండలం శివారులో 15 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాముల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సుల్తానాబాద్ సహకార సంఘాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విత్తన శుద్ధి కేంద్రంగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నుల గోదాముల పనులు ప్రారంభించామని, మరో 14 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు నిర్మించనున్నామని చెప్పారు. రానున్న రెండేళ్లలో నియోజకవర్గ వ్యాప్తంగా లక్ష మెట్రిక్ టన్నులకుపైగా గోదాముల నిర్మాణానికి కృషి చేస్తామని వెల్లడించారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, గర్రెపల్లి--భూపతిపూర్ గ్రామాల శివారులో మహిళల నిర్వహణలో పెట్రోల్ బంకును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. నీరుకుల, కోమండ్లపల్లి, రంగంపల్లి, వేగురుపల్లి గ్రామాల ప్రజలకు ఈ పెట్రోల్ బంకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గర్రెపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. నీరుకుల గ్రామానికి రెండు నెలల్లో మానేరు వాగు మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని, గ్రామ ప్రజల చిరకాల కోరిక అయిన బస్సు సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాంపల్లి సతీష్ కుమార్, ఏఎంసీ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, డీసీవో శ్రీమాల, ఉపసర్పంచ్ సతీష్, సీఈవో బూర్గు సంతోష్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణలో భాగంగా మంథని కూరగాయల మార్కెట్ దుకాణాల తొలగింపు

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచారం, జూన్ 29

మంథని పట్టణంలో రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా కూరగాయల మార్కెట్ పరిసరాల్లోని పలు దుకాణాలను మున్సిపల్ అధికారులు సోమవారం తొలగించారు. ట్రాఫిక్ సమస్యను తగ్గించడం, రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయడం లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న దుకాణాలను ముందస్తు నోటీసుల మేరకు తొలగించగా, మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షణలో ప్రక్రియ కొనసాగింది. ఈ సందర్భంగా కొంతమంది వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేయగా, అధికారులు వారికి పరిస్థితిని వివరించి సహకరించాలని కోరారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయిన అనంతరం ప్రజలకు, వాహనదారులకు మెరుగైన రాకపోకల సౌకర్యం అందుబాటులోకి వస్తుందని అధికారులు పేర్కొన్నారు.



అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

# ఆట








## శతకంతో చెలరేగిన సాయి సుదర్శన్

శ్రీలంక-ఏతో జరుగుతున్న అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో భారత్-ఏ ఓపెనర్ సాయి సుదర్శన్(175 బంతుల్లో 19 ఫోర్లతో 132) శతకంతో చెలరేగాడు. దాంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవరల్లో 4 వికెట్లకు 333 పరుగులు చేసింది. సాయి సుదర్శన్‌తో పాటు కెప్టెన్ ధ్రువ్ జురెల్(138 బంతుల్లో 5 ఫోర్లతో 68 బ్యాటింగ్), తెలుగు తేజం షేక్ రషీద్(92 బంతుల్లో 4 ఫోర్లతో 53) అజేయ హాఫ్ సెంచరీలతో రాణించారు. శ్రీలంక-ఏ బౌలర్లలో సుదీర రెండు వికెట్లు తీయగా.. చామిక గుణశేఖర, రావిందు ఫెర్నాండో తలో వికెట్ తీసారు. గురువారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు సాయి సుదర్శన్, ఆయుష్ పాండే(25) అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు 82 పరుగులు జోడించారు.

## సుదీర్ఘ విరామం తర్వాత మైదానంలోకి నెయ్‌మర్

స్కాట్లాండ్‌పై 3-0 తేడాతో బ్రెజిల్ ఘనవిజయం

2026 ఫిఫా ప్రపంచకప్‌లో ఫుట్‌బాల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. బ్రెజిల్ దిగ్గజ ఆటగాడు నెయ్‌మర్ జూనియర్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టాడు. 2026 ఫిఫా ప్రపంచకప్‌లో భాగంగా స్కాట్లాండ్‌తో జరిగిన గ్రూప్-సి మ్యాచ్‌లో నెయ్‌మర్ బరిలోకి దిగాడు. ఈ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై 3-0 తేడాతో బ్రెజిల్ ఘనవిజయం సాధించి, టోర్నీలో నాకౌట్ దశకు దూసుకెళ్లింది. నెయ్‌మర్ 2023 అక్టోబర్ తర్వాత బ్రెజిల్ తరఫున మళ్లీ ఇప్పుడే మైదానంలోకి వచ్చాడు. ఆ సమయంలో ఉరుగ్వేతో జరిగిన ప్రపంచకప్ క్వాలిఫైయర్ మ్యాచ్‌లో అతనికి మోకాలికి తీవ్రమైన గాయం అయింది. ఆ తర్వాత ఇటీవలే పిక్క గాయం కూడా వేధించింది. దీంతో అతను దాదాపు రెండేళ్లపాటు ఆటకు పూర్తిగా దూరమయ్యాడు. ఇటీవల ఫిట్‌నెస్ సాధించిన నెయ్‌మార్ స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో 76వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా మథ్యూస్ కున్హా స్థానంలో మైదానంలోకి అడుగుపెట్టాడు. ఆ సమయంలో అభిమానుల కరతాళ ధ్వనులు ఈ మ్యాచ్‌కే హైలైట్. ఈ మ్యాచ్‌లో ఆడటం ద్వారా నెయ్‌మర్ తన అంతర్జాతీయ కెరీర్‌లో ఒక మైలురాయిని అందుకున్నాడు. ఇది అతనికి నాలుగో ఫిఫా ప్రపంచకప్ టోర్నమెంట్. అంతకుముందు అతను 2014, 2018, 2022 ప్రపంచకప్ ఎడిషన్లలో ఆడాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్రెజిల్ మొదటి నుంచీ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బ్రెజిల్ స్టార్ ప్లేయర్ వినీషియస్ జూనియర్ ఫస్ట్ హాఫ్‌లోనే రెండు సూపర్ గోల్స్‌తో మెరిశాడు. మ్యాచ్ ప్రారంభమైన 7వ నిమిషంలోనే జట్టుకు తొలి గోల్ అందించాడు. హాఫ్-టైమ్‌కు కొద్ది నిమిషాల ముందు హెడర్ ద్వారా రెండో గోల్ చేసి బ్రెజిల్‌ను 2-0తో ఆధిక్యంలో నిలిపాడు. ఆ తర్వాత సెకండ్ హాఫ్‌లో మథ్యూస్ కున్హా మూడో గోల్ సాధించడంతో బ్రెజిల్ 3-0తో విజయాన్ని ఖాయం చేసుకుంది. ఈ రెండు గోల్స్‌తో వినీషియస్ రికార్డును సొంతం చేసుకున్నాడు.

# రామగుండం అభివృద్ధిపై ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచారం, జూన్ 29



రామగుండం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామగుండంలో ప్రతిపాదిత 1ఐ800 మెగావాట్ల బి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరగడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని, అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెంది ప్రాంత ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే వివరించారు. అదేవిధంగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌ను అర్బన్ చాలెంజ్ ఫండ్ స్కీమ్‌లో చేర్చి నగర సమగ్రాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అంతర్గత రహదారుల విస్తరణ, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధి, వైద్య, విద్యా సౌకర్యాల మెరుగుదల, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం వంటి పనులకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న రామగుండం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలతో రామగుండం రాష్ట్రంలో ఆదర్శ పారిశ్రామిక నగరంగా ఎదుగుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వినతిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, రామగుండం అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ తెలిపారు. రామగుండం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## వాణి స్కూల్‌లో పుస్తకాల విక్రయాలపై ఎంఈఓ చర్యలను స్వాగతించిన ప్రజాప్రతినిధులు





పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 29

సెంటర్ కాలనీలోని వాణి స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులపై మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) తీసుకున్న చర్యలను పలువురు రాజకీయ పార్టీల నాయకులు స్వాగతించారు. తల్లిదండ్రుల ఫిర్యాదుల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎంఈఓకు వినతిపత్రం అందజేయగా, సంబంధిత పుస్తకాల విక్రయ కేంద్రంపై అధికారులు చర్యలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపే చర్యలు ఏ విద్యాసంస్థలోనూ చోటుచేసుకోరాదన్నారు. ముఖ్యంగా సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటైన విద్యాసంస్థల్లో పారదర్శకత, ప్రభుత్వ నిబంధనల అమలు తప్పనిసరిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు, పుస్తకాల విక్రయాల నిబంధనలు, వినియోగదారుల హక్కులు, విద్యాశాఖ మార్గదర్శకాలను ప్రతి ప్రైవేట్ విద్యాసంస్థ తప్పనిసరిగా పాటించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి తప్పులు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తల్లిదండ్రులకు జరిగిన నష్టానికి న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ విద్యార్థి నాయకుడు ఎండీ వాజిద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, కాళేశ్వరం డైరెక్టర్ కాటన్ సత్యం, కాంగ్రెస్ నాయకుడు దాసరి శివ, మొలుమూరి శ్రీనివాస్, బీజేపీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు తీగల శ్రీధర్, టౌన్ అధ్యక్షుడు దంతుల సురేష్‌తో పాటు అధిక సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో క్రైమ్ ఫ్రీ డివిజన్ల ఏర్పాటుకు కృషి చేయాలి: డీసీపీ బి. రామ్‌రెడ్డి

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 29






రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో ప్రతి డివిజన్‌ను క్రైమ్ ఫ్రీ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో పరేడ్ నిర్వహించి వారి పనితీరును సమీక్షించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు. తదుపరి గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 35 డివిజన్లకు నియమితులైన డివిజన్ పోలీస్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి డివిజన్‌లో ఆస్తి సంబంధిత నేరాలు, మహిళలపై నేరాలు, సైబర్ నేరాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నంబర్ ప్లేట్లు లేని, సరైన పత్రాలు లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, యువత, పెద్దలతో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్ మోసాలపై ప్రజలకు చైతన్యం కల్పించి యువతను సామాజిక సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి డివిజన్‌లోని ఆసుపత్రులు, దేవాలయాలు, వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు వంటి కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని, సంబంధిత భద్రతా సిబ్బంది, నిర్వాహకుల వివరాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వారానికి రెండు నుంచి మూడు సార్లు డివిజన్‌లో పర్యటించి స్థానికులతో సమావేశాలు నిర్వహిస్తూ వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించేలా "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని డీసీపీ బి. రామ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, అఫ్జలుద్దీన్, ఎస్ఐలు రమేష్, మనోహర్, అనూష తదితరులు పాల్గొన్నారు.

## పూసల సంఘం నూతన జిల్లా అధ్యక్షులను సన్మానించిన పెర్క శ్యామ్



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 29

పూసల భవన్‌లో సోమవారం నూతనంగా పూసల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పొదిల కుమారస్వామి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సెని తిరుపతిని టీపీసీసీ నాయకుడు పెర్క శ్యామ్ మర్యాదపూర్వకంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెర్క శ్యామ్ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో సంఘ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రజలకు సేవ చేయాలనే బాధ్యతతో ముందుకు సాగుతూ పూసల సంఘం సభ్యుల ఐక్యత, సంక్షేమం, సామాజిక పురోగతి కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. జిల్లాలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ సంఘాన్ని బలోపేతం చేయాలని నూతన అధ్యక్షులకు సూచించారు.

## ఐదేళ్ల కుటుంబ విభేదాలకు రక్తపాతం ముగింపు.. బొక్కలగుట్టలో వ్యక్తి హత్య:

అర్జున్ సమాచారం జూన్ 29.మంచిర్యాల జిల్లా. ప్రతినిధి:

మందమర్రి: మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి బొక్కలగుట్ట ప్రాంతంలో ఆదివారం రాత్రి వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు.



స్థానికుల కథనం ప్రకారం గజ్జి వెంకటేష్‌పై అదే గ్రామానికి చెందిన ఒడ్డేపల్లి రాజ్‌కుమార్ గడ్డకట్టిన సిమెంట్ బస్తాను పై నుంచి విసిరాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిసింది. వెంకటేష్‌కు, రాజ్‌కుమార్‌కు మధ్య గత ఐదేళ్లుగా కుటుంబ విభేదాలు కొనసాగుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఆ పాత గొడవల నేపథ్యంలోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. సమాచారం అందుకున్న రామకృష్ణాపూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. హత్యకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు కొనసాగుతోంది. పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

## బుధవారంపేటలో ఇంటింటి ఎస్ఐఆర్ సర్వే నిర్వహణ

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 29

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని బుధవారంపేట గ్రామంలో ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు వివరాలను పరిశీలించడంతో పాటు అవసరమైన దరఖాస్తులను ప్రజలకు అందజేసి వాటిని పూరించే ప్రక్రియ చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ అరెల్లి మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓటరు నమోదు, మార్పులు--చేర్పులు, తప్పుల సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటరు వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. సర్వే ద్వారా స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి కృషి కొనసాగుతోందని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు అందేలా పార్టీ శ్రేణులు చురుకుగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపీవో రాజేష్, బీఎల్ఓ ఎంజాల సతీష్ పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయడానికి ఓటర్లు బీఎల్ఓలకు సహకరించాలని, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని వారు సూచించారు.



## మీరు ప్రచురించేందుకు సిద్ధంగా ఉండేలా వార్తను సవరించాను.

### కల్వచర్లలో ఓటరు సర్వేలో పాల్గొన్న సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచారం, జూన్ 29

రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి పాల్గొన్నారు. భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఓటరు జాబితాలో పారదర్శకత, ఖచ్చితత్వం పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి వివరాలను సేకరించారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయడం, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించడం, మరణించిన వారి పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను గుర్తించి తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఓటర్లు తమ పేరు, చిరునామా, పుట్టిన తేదీ, ఎపిక్ (ఈపీఐసీ) నంబర్ వంటి వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు. వివరాల నమోదు లేదా సవరణ కోసం ఆధార్ కార్డు, పాన్ కార్డు, రేషన్ కార్డు లేదా ప్రస్తుత చిరునామా ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటో వంటి పత్రాలను సమర్పించాలని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి మాట్లాడుతూ గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ సర్వే లక్ష్యమన్నారు. గ్రామస్థులందరూ బీఎల్ఓలకు సహకరించి తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన పత్రాలను సమర్పించాలని కోరారు. సరైన ఆధారాలు సమర్పించని పక్షంలో ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కస్ప మహేందర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



## సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలకు రత్నాపూర్ సర్పంచ్ సంఘీభావం



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచారం, జూన్ 29**

సెంటినరీ కాలనీలోని ఆర్జీ–3 ఏపీఏ జీఎం కార్యాలయం ఎదుట సింగరేణి అధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సింగరేణి ప్రభావిత గ్రామమైన రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోల్ ఇండియాలో అమలు చేస్తున్న విధానానికి అనుగుణంగా సింగరేణి అధికారులకు పే అప్‌గ్రేడేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పీఆర్పీ బకాయిలను తక్షణమే చెల్లించడంతో పాటు కోల్ ఇండియా అధికారులతో సమానంగా అన్ని అలవెన్సులు, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. సింగరేణికి రావలసిన బకాయిలను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రిలే నిరాహార దీక్షల్లో పాల్గొంటున్న అధికారులకు ఆమె సంఘీభావం తెలియజేస్తూ వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు.

## మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఐ, డిజిటల్ లెర్నింగ్‌పై శిక్షణ ప్రారంభం



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచారం, జూన్ 29**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "అన్న – అక్క" మెంటర్‌షిప్ కార్యక్రమంలో భాగంగా మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఏఐ (కృత్రిమ మేధ), డిజిటల్ లెర్నింగ్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సీహెచ్. పరిశయ్య ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "అన్న – అక్క" మెంటర్‌షిప్ కార్యక్రమం విద్యార్థులను భవిష్యత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా తీర్చిదిద్దుతుందని అన్నారు. కళాశాల నోడల్ అధికారి కర్నాటి కృష్ణ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక రంగంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తోందని, ఇది విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్యల పరిష్కార సామర్థ్యం, డిజిటల్ నైపుణ్యాలను పెంపొందిస్తుందని తెలిపారు. ఈ శిక్షణలో బీఏ, బీకాం, బీఎస్సీ ఐదో సెమిస్టర్, బీకాం (బీఎఫ్ఎస్ఐ) మూడో సెమిస్టర్ విద్యార్థులు పాల్గొంటున్నారు. రెండు రోజుల శిక్షణ అనంతరం కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఏఐ, డిజిటల్ లెర్నింగ్‌పై అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో నోడల్ ఫ్యాకల్టీ సభ్యుడు ముకుందం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు రజిత, శేఖర్, బోధనేతర సిబ్బంది దుర్గరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బొంపల్లి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచారం, జూన్ 29**

పెద్దపల్లి మండలంలోని బొంపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీ రంగనాథ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సోమవారం పాల్గొన్నారు. గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు ఆలయానికి చేరుకున్న ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు దాసరి మనోహర్ రెడ్డికి ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన గ్రామ ప్రజలతో ముచ్చటిస్తూ శ్రీ రంగనాథ స్వామి వారి దివ్య ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజకుమార్, బీఆర్ఎస్ నాయకులు సలేంద్ర రాములు యాదవ్, కొమరేష్, అంజయ్య, సతీష్, సడి, లింగయ్య, శంకరయ్య, చంటి హరీష్, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# సందేనవేణి మహేంద్రనాథ్ యాదవ్ జన్మదిన వేడుకలు

## కేక్ కట్ చేసి వృద్ధులకు అన్నదానం ఫ్రూట్స్ పంపిణీ

**మంచిర్యాల జిల్లా ప్రతి నిధి ,అర్జున్ సమాచారం , జూన్ 29:**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తిలక్ నగర్ లో అమృతహస్తాం వెల్ఫేర్ సొసైటీ లో అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు గౌ





శ్రీ సందేనవేణి మహేంద్రనాథ్ యాదవ్ జన్మదిన వేడుకలను ఆదివారం నాడు ఘనంగా తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం అధ్యక్షతన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ అమృత హస్తం వెల్ఫేర్ సొసైటీ లో కేక్ కట్ చేసి వయోవృద్ధులు ,అనాధల మధ్య ఘనంగా సంబరాలు చేసుకోవడం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం పండ్ల పంపిణీ చేయడం జరిగింది. మహేంద్ర నాథ్ యాదవ్ నిరుపేదలకు నిరంతరం అండగా ఉంటూ ఆపదలను తీరుస్తున్న గొప్ప వ్యక్తి ,ఎన్నో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ మెడికల్ క్యాంపు, ఐ క్యాంపులు, అన్నదాన కార్యక్రమాలు, నిరుపేద పిల్లలకు తనవంతుగా చదువుకోవడానికి ఆర్థిక సహాయం అందిస్తూన్నారు ఇలాంటి మహనీయుడి జన్మదిన వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా చేసుకోవడం ఖమ్మం జిల్లా, భూపాలపల్లి జిల్లా ,కరీంనగర్ జిల్లా, ఆదిలాబాద్ జిల్లా ,మంచిర్యాల జిల్లా లో ఘనంగా చేయడం జరిగింది ఆశ్రమంల్లో నీ పిల్లలు వయెవృద్ధుల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని నిండు నూరేళ్ల సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మరోసారి తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో వారు మంచిర్యాల జిల్లా అధ్యక్షులు చిల్లారపు సంతోష్ యాదవ్ హైదరాబాద్, డాక్టర్ ఎన్ జీ ఓ ఎంకే రాజేష్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు, నూనె హరిబాబు యాదవ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ,మంచాల రవీందర్ యాదవ్ భూపాల్ పల్లి జిల్లా అధ్యక్షులు, గజ్జి రమేష్ యాదవ్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు, నంబాల శ్రీనివాస్ యాదవ్ మందమర్రి మండలం ఉపాధ్యాయులు, సందెనవేని మల్లేష్ యాదవ్, కత్తర్ల సాగర్ యాదవ్, దాడి రాజబాబు యాదవ్, కొమ్ము దేవేందర్ యాదవ్, జంగపల్లి శ్రీధర్ అమృత హస్తం సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ రమేష్, మహిళలు, వృద్ధులు మరియు నాయకులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీ జైపూర్, భీమారం పరిధిలో పల్స్ పోలియో సక్సెస్!



**97.5 శాతం లక్ష్య సాధన.. వంద శాతం దిశగా అడుగులు**

**ఉత్సాహంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ప్రజలు**





**మంచిర్యాల, జూన్ 29 (అర్జున్ సమాచారం):**

మండల వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత ఘనంగా, విజయవంతంగా ముగిసింది. పీహెచ్‌సీ జైపూర్ మరియు భీమారం పరిధిలో ఐదేళ్ల లోపు వయసున్న చిన్న పిల్లలందరికీ ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. ఉదయం నుంచే తల్లిదండ్రులు తమ చిన్నారులను పోలియో కేంద్రాలకు తీసుకురావడంతో బూత్‌లన్నీ సందడిగా మారాయి. ఈ ముమ్మర నైపుణ్యంతో తొలిరోజే ఏకంగా 97.5% లక్ష్యాన్ని విజయవంతంగా సాధించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ముస్తఫా మాట్లాడుతూ, "జైపూర్ పీహెచ్‌సీ, భీమారం పరిధిలో 97.5% మంది అర్హులైన చిన్నారులకు పోలియో చుక్కలు అందించాం. మిగిలిన పిల్లలను కూడా గుర్తించి, ప్రత్యేక మొబైల్ టీమ్‌లు, ఇంటింటి బృందాల ద్వారా టీకాలు అందించి 100% లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు కొనసాగిస్తున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది మరియు తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు మరియు పంచాయతీ కార్యదర్శులు ఈ కార్యక్రమాలను దగ్గరుండి ప్రారంభించారు. భవిష్యత్ తరాలను పోలియో మహమ్మారి బారిన పడకుండా కాపాడుకోవడానికి ఈ చుక్కల మందు ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు. వైద్యాధికారి ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది మరియు ఇతర ఆరోగ్య సిబ్బంది సమిష్టిగా రంగంలోకి దిగారు. పీహెచ్‌సీలు, ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనే కాకుండా, బూత్‌లకు రాలేని వారి కోసం ప్రత్యేకంగా ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేశారు. గ్రామ ప్రజల పూర్తి సహకారంతో భీమారం,జైపూర్ మండలంల లో పల్స్ పోలియో కార్యక్రమం సంపూర్ణంగా విజయవంతమైందని అధికారులు వెల్లడించారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచారం, జూన్ 29**

మంథని మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మండల నాయకుల సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజులు, బుక్ స్టాల్స్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ, మంథనిలోని పలు ప్రైవేట్ పాఠశాలలు విద్యా హక్కు చట్టంలోని నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. కొన్ని విద్యాసంస్థలు నిర్దిష్ట బుక్ స్టాల్‌లోనే పుస్తకాలు కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయని, అనుమతులు లేని బుక్ స్టాల్స్‌లో పుస్తకాల విక్రయాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఐఐటీ, ఒలింపియాడ్ కోర్సుల పేరుతో వేల రూపాయలు అదనంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా సంబంధిత విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలలు, బుక్ స్టాల్స్‌పై తనిఖీలు నిర్వహించిన దాఖలాలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు, అనుమతులు లేకుండా పుస్తకాలు విక్రయిస్తున్న బుక్ స్టాల్స్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అరుణ్, సాయి, రాజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొక్కుల నరేష్‌పై అసత్య ప్రచారాలు నమ్మొద్దు: భీమారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు పోడెటి రవి

**భీమారం(మంచిర్యాల) , అర్జున్ సమాచారం, జూన్ 29**

భీమారంలో గత మూడు రోజులుగా కొక్కుల నరేష్ అకౌంట్ కి వచ్చిన రూ. 1.50 లక్షల నిధులు మాయమయ్యాయంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని ఎట్టకేలకు స్థానిక యువత వాస్తవాలు తెలుసుకున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా వాట్సాప్‌లలో, సోషల్ మీడియాలో కొక్కుల నరేష్‌పై వస్తున్న ఆరోపణలను భీమారం మండల కాంగ్రెస్ శ్రేణులు మరియు భీమారం మండల అధ్యక్షులు పోడెటి రవి తీవ్రంగా ఖండించారు. ఆదివారం జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ, గతంలో మంత్రి వివేక్ వెంకటస్వామి భీమారం వచ్చినప్పుడు గ్రామస్తులు కోతుల సమస్యను వివరించగా, ఆయన డీఎంఎఫ్ టి నిధుల నుండి రూ. 1.50 లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ నిధులను నిబంధనల ప్రకారం ఎంపిడిఓ గారి సిఫార్సుతో కోతుల సమస్య నివారణ కోసమే కేటాయించామని స్పష్టం చేశారు. కోతులను పట్టడం లో చురుక్కుగ్గా పని చేసిన పార్టీలకు సంబంధం లేని రామల్ల రాజ్‌కుమార్, మెండ మల్లేష్‌ల పేరుతో జాయింట్ అకౌంట్ ఏర్పాటు చేసి ఈ నిధులను అందులోనే జమ చేశారని , నరేష్ తన సొంతానికి వాడుకోలేదని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆ డబ్బులను కోతులు పట్టడం కోసం వాడుతామని స్పష్టం చేశారు. రాజకీయం కోసం అభివృద్ధిని అడ్డుకోవద్దని, ఇకపై కూడా నిజాలు తెలుసుకోకుండా వాట్సాప్‌లలో వచ్చే నిరాధారమైన ఆరోపణలు యువత గమనించి నిజ నిజాలు తెలుసుకోవాలని , ఇలాంటి ఆరోపణలు ఎవరు చేసిన సీరియస్‌గా తీసుకొని పోలీస్ స్టేషన్‌లో కేసులు పెడతామని మండల కాంగ్రెస్ కమిటీ హెచ్చరించారు.



తెలంగాణ గ్రామీణ బ్యాంక్
TELANGANA GRAMEENA BANK
Scheduled Bank Owned by Government

Customer Name : Mr. RAMALLA RAJ KUMAR
RAMALAYAM STREET,
BHEEMARAM , MANCHERIAL : 504204

TELANGANA GRAMEENA BANK
Date : 29/06/2026
Statement of Account From : 16/04/2026 To : 27/06/2026

| Post Date | Value Date | Details | Chq no | Debit | Credit | Balance |
|---|---|---|---|---|---|---|
| | | | | BROUGHT | FORWARD: | 0.00 |
| 16/04/26 | 16/04/26 | DEP TFR | | | 1000.00 | 1000.00Cr |
| 20/04/26 | 20/04/26 | By Cash | | | 149000.00 | 150000.00Cr |
| 27/06/26 | 27/06/26 | CR INT CR | | | 709.00 | 150709.00Cr |

Ope Bal | Dr count 0000 | Cr count 3 | Debits | Credits 1,50,709.00 | Clo Bal 1,50,709.00Cr

--- END OF STATEMENT ---

PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
సినిమా
CINEMA



# ఓటీటీలోకి 'పెద్ది'.. హిందీ ప్రేక్షకులు మాత్రం ఇంకాస్త వెయిట్ చేయాల్సిందే!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కించిన ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలై ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణను అందుకుంది. భావోద్వేగాలు, స్పోర్ట్స్ ఎలిమెంట్స్, గ్రామీణ నేపథ్యం కలిసిన ఈ సినిమా థియేటర్లలో సెన్సేషన్ సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా రూ. 400 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఓటీటీ విడుదలకు సంబంధించిన తాజా సమాచారం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'పెద్ది' డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం జూలై 2 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో కూడా సినిమా అందుబాటులోకి రానుంది. థియేటర్లలో భారీ విజయాన్ని అందుకున్న ఈ చిత్రం ఓటీటీలో కూడా అదే స్థాయిలో ఆదరణ పొందుతుందనే అంచనాలు ఉన్నాయి. అయితే ఉత్తర భారత ప్రేక్షకులు మాత్రం 'పెద్ది' హిందీ వెర్షన్ కోసం మరికొంతకాలం వేచి చూడాల్సి ఉంటుంది. బాలీవుడ్ థియేట్రికల్ విడుదల నిబంధనల ప్రకారం, సినిమా విడుదలైన ఎనిమిది వారాల తర్వాతే హిందీ ఓటీటీ స్ట్రీమింగ్‌కు అనుమతి ఉంటుంది.





# పారిస్‌లో జక్కన్నకు అరుదైన గౌరవం..

## ఫ్రాన్స్ చారిత్రక హాల్‌లో ఎస్.ఎస్. రాజమౌళికి శాశ్వత సీటు

భారతీయ సినిమాను ప్రపంచ వేదికపై నిలబెట్టిన దర్శకుల్లో ఎస్.ఎస్. రాజమౌళి పేరు అగ్రస్థానంలో నిలుస్తుంది. కెరీర్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఒక్క పరాజయం కూడా చూడని దర్శకుడిగా జక్కన్న ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన రూపొందించిన ప్రతి సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాలు సాధించడమే కాకుండా, తెలుగు సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో కొత్త గుర్తింపును తీసుకొచ్చింది. ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న ప్రతిష్టాత్మక అడ్వెంచర్ చిత్రం 'వారణాసి' ప్రీ-ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉన్న రాజమౌళి ఖాతాలో తాజాగా మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం చేరింది.

# 'నో' చెప్పడం నేర్చుకోండి



'ప్రతిభావంతులైన నటీనటులు రొటీన్ కథలకు 'నో' చెప్పడం నేర్చుకోవాలి' అంటున్నారు బాలీవుడ్ భామ కంగనా రనౌత్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను ఆమె వెల్లడించారు. 'నా యాటిట్యూడ్ కొందరికి ఇబ్బందిగా ఉంటుంది. నిర్మొహమాటంగా మాట్లాడటం. నచ్చని దాన్ని 'నచ్చలేదు' అని ముఖం మీదే చెప్పడం చాలామందికి నచ్చదు. కానీ నా ఉద్దేశ్యంలో 'నో' చెప్పడం చేతకాని వాళ్లు జీవితాన్ని గెలవలేరు. ఈ కారణంగా మనం టార్గెట్ అయినా.. దక్కాల్సిన అవకాశాలు మనకు దక్కకపోయినా.. చివరికి మాత్రం నిజాయితీనే గెలుస్తుంది. సంఖ్య అనేది ఎప్పటికీ ముఖ్యం కాదు. క్వాలిటీనే ముఖ్యం. మనం చేసిన పాత్రలు కొన్నేళ్లపాటు గుర్తుంటే, మనం ఆటోమేటిగ్గా గుర్తుంటాం. నచ్చని కథల్ని దూరం పెట్టాను కాబట్టే, నేను రెగ్యులర్ హీరోయిన్ల లిస్ట్‌లో లేను. అందుకు బాధ లేదు. నాకంటూ జనాల్లో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అది చాలు' అన్నారు కంగనా. ప్రస్తుతం ఆమె 'క్వీన్ 2'లో నటిస్తున్న విషయం తెలిసిందే.

# పారిస్‌లో హీరోయిన్‌కు షాక్..

విదేశాల్లో సినిమా షూటింగ్‌లకు వెళ్లిన పలువురు సినీ ప్రముఖులు అనుకోని ఇబ్బందులను ఎదుర్కొన్న సందర్భాలు గతంలో చాలానే ఉన్నాయి. తాజాగా ఓ కొత్త హీరోయిన్‌కు పారిస్‌లో చేదు అనుభవం ఎదురైంది. తెలుగులో 'హ్యాపీ జర్నీ' సినిమాతో ఎంట్రీ ఇవ్వబోతున్న నటి జినీషా, పారిస్‌కు చేరుకున్న వెంటనే దాదాపు రూ. 4 లక్షల విలువైన సూట్‌కేసులను పోగొట్టుకోవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. 'హ్యాపీ జర్నీ' చిత్రంలో అన్నపూర్ణమ్మ, ఝాన్సీ, ఆమని, పాయల్ రాధాకృష్ణ, రవి శివతేజ, వంశీ, జినీషా, రూప తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పలువురు విభిన్న వ్యక్తులు కలిసి ప్యారిస్‌కు వెళ్లిన తర్వాత జరిగే ఆసక్తికర సంఘటనల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమా షూటింగ్ మొత్తం ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోనే నిర్వహించారు. దాదాపు 22 రోజుల పాటు చిత్రబృందం అక్కడే ఉండి షూటింగ్ పూర్తి చేసింది. ఇటీవల ఈ చిత్ర టీజర్ లాంచ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించగా, ఆ కార్యక్రమంలో నటి ఝాన్సీ చేసిన వ్యాఖ్యలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాయి. "పారిస్‌లో దిగిన వెంటనే మా అమ్మాయి జినీషా సూట్‌కేసులు పోయాయి. దాదాపు నాలుగు లక్షల రూపాయల విలువైన దుస్తులు, వ్యక్తిగత వస్తువులు ఉన్న బ్యాగులు కనిపించలేదు" అని ఝాన్సీ వెల్లడించారు.



# భాగ్యనగరంలో చివరి షెడ్యూల్

మెగా హీరో సాయిదుర్గతేజ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక పానిండియా ప్రాజెక్ట్ (సంబరాల ఏటిగట్టు). రోహిత్ కేపీ దర్శకుడు. కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మాతలు. ఈ సినిమా నిర్మాణం చివరి దశకు చేరింది. ఈ క్రమంలో కీలక షెడ్యూల్ ఆదివారం నుంచి హైదరాబాద్‌లో మొదలైంది. అద్భుతమైన యాక్షన్ ప్యాక్డ్ సన్నివేశాలు తీసేందుకు ప్రత్యేకంగా ఓ భారీ సెట్‌ని నిర్మించారు. ఈ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొనే కీలక ఘట్టాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరిస్తారు. సాయిదుర్గతేజ్ కెరీర్‌లోనే అత్యంత శక్తివంతమైన, ఇంటెన్స్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ కొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇవ్వనున్నదని మేకర్స్ చెబుతున్నారు. పవర్‌ఫుల్ స్క్రీన్‌ప్లే, ఉత్కంఠభరితమైన విజువల్స్, హై-ఆక్టేన్ సన్నివేశాల మేళవింపుతో గ్రాండ్ యాక్షన్ డ్రామాగా దర్శకుడు రోహిత్ కేపీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని, ఈ షెడ్యూల్ అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలుపెడతామని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. ఐశ్వర్యలక్ష్మి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిసామి, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్. 2



## యువతే కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు: సెంటినరీ కాలనీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుపతికి జన్మదిన శుభాకాంక్షలు



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచారం, జూన్ 29**

రామగిరి మండలం పన్నూరు గ్రామపంచాయతీ పరిధిలోని సెంటినరీ కాలనీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుపతి జన్మదిన వేడుకలు సోమవారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పన్నూరు గ్రామ సర్పంచ్ చిందం మహేష్ పాల్గొని రఘుపతితో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చిందం మహేష్ మాట్లాడుతూ యువతే కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు అని అన్నారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత యువ నాయకులపై ఉందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజాసేవ, సామాజిక బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రఘుపతి పార్టీ పట్ల చూపుతున్న నిబద్ధత అభినందనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

## జులై 5న బహుజన గర్జనకు సిద్ధం కావాలి: మహేష్ వర్మ పిలుపు




**అర్జున్ సమాచారం జూన్ 29 మంచిర్యాల ప్రతినిధి:**

మంచిర్యాల జిల్లా:జులై 5న నిర్వహించనున్న బహుజన గర్జన సభను విజయవంతం చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకుడు మహేష్ వర్మ పిలుపునిచ్చారు. బహుజనులంతా ఒక్కటై రాజ్యాధికారం మనదేనని గర్జించాలని కోరారు. తీన్మార్ మల్లన్న నాయకత్వంలో సామాజిక తెలంగాణ నిర్మాణమే లక్ష్యమని తెలిపారు. తెలంగాణ మహనీయుల ఆశయాలకు అనుగుణంగా బహుజనుల ఆత్మగౌరవాన్ని చాటే మహాసభగా జులై 5 గర్జన నిలవాలని ఆకాంక్షించారు. బహుజనుల ఐక్యతతో ప్రజాస్వామ్య పాలనలో సమాన అవకాశాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు పాలనా భాగస్వామ్యం దక్కే దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చరిత్రలో నిలిచిపోయే ఉద్యమానికి ప్రతి బహుజనుడు భాగస్వామి కావాలని, జులై 5 గర్జనను విజయవంతం చేయాలని మహేష్ వర్మ కోరారు.

## ప్రతి పోలింగ్ కేంద్రంలో పార్టీ బలోపేతమే లక్ష్యం: మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి:

**అర్జున్ సమాచారం జూన్ 29.మంచిర్యాల జిల్లా. ప్రతినిధి:**

మంచిర్యాల జిల్లా:మందమర్రి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పోలింగ్ కేంద్ర స్థాయి ప్రతినిధుల సమీక్ష సమావేశంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు



రఘునాథ్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలింగ్ కేంద్ర స్థాయి ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి పోలింగ్ కేంద్ర స్థాయిలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడం, ప్రతినిధుల వ్యవస్థను సమర్థంగా నిర్వహించడం, ఓటరు జాబితాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

# జిల్లా కాంగ్రెస్‌లో కీలక పోస్టులకు నియామకాలు..

### ఎల్లే రామ్మూర్తి ఉపాధ్యక్షుడు, రొడ్డ బాపన్న కార్యదర్శి

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచారం, జూన్ 29**



పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో కీలక నియామకాలు చేపట్టినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రకటించారు. ఈ మేరకు జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎల్లే రామ్మూర్తిని, జిల్లా కార్యదర్శిగా రొడ్డ బాపన్నను నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లే రామ్మూర్తి, జిల్లా కార్యదర్శి రొడ్డ బాపన్న తమపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ నూతనంగా నియమితులైన ఇద్దరు నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు సమర్థవంతంగా పనిచేసి పార్టీ అభివృద్ధికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు. నూతనంగా నియమితులైన నాయకులు మాట్లాడుతూ పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల బీసీ సెల్ అధ్యక్షుడు బండారి సదానందం, లద్నాపూర్ సర్పంచ్ వనం రామచంద్రరావు, మాజీ సర్పంచ్‌లు తీగల సమ్మయ్య, ఎరుకల బాపూరావు, ఐఎన్‌టీయూసీ నాయకుడు బెల్లం శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదయ్య, ధర్మల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలు కనుకయ్య, భద్రయ్య, వేగోలపు మోహన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంథనిలో ఘనంగా వటసావిత్రి పూర్ణిమ వేడుకలు

### సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించిన మహిళలు



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచారం, జూన్ 29:**

మంథని పట్టణంలో వటసావిత్రి పూర్ణిమ వేడుకలను మహిళలు సోమవారం ఘనంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. నిజ జ్యేష్ఠ మాసం శుక్ల పక్ష పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని వివిధ వీధుల్లో మహిళలు మర్రిచెట్టును భక్తిశ్రద్ధలతో పూజించి కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సౌభాగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వటసావిత్రి పర్వదినాన విష్ణుమూర్తి అవతారంగా భావించే మర్రిచెట్టుకు 108 దారాలు చుట్టి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. జ్యేష్ఠ నక్షత్రంతో కూడిన పౌర్ణమిని జ్యేష్ఠ పూర్ణిమగా పరిగణిస్తారని, ఈ రోజున వటసావిత్రి వ్రతాన్ని ఆచరించడం విశేష ఫలితాలను ఇస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఎడ్లు, నాగలి తదితర వ్యవసాయ పని ముట్లను పూజించే సంప్రదాయం కొనసాగుతోంది. పూజల అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా పండుగ వాతావరణం నెలకొని, మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.

## రుణాలను సకాలంలో చెల్లించాలి.. లేకుంటే రెవెన్యూ వసూళ్ల చట్టం కింద చర్యలు తప్పవు: మండల ఏ.పి.ఎం. సంతోష్.

**అర్జున్ సమాచారం జూన్ 29.మంచిర్యాల జిల్లా. ప్రతినిధి:**

మంచిర్యాల జిల్లా, జైపూర్:జైపూర్ మండల కేంద్రం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మండల ఏపీఎం సంతోష్ మహిళా సంఘాల సభ్యులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా సంఘాల ద్వారా పొందిన రుణాలను నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా చెల్లించాలని సూచించారు. రుణాల సకాల చెల్లింపే మహిళా సంఘాల అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి సంఘం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ నెలవారీ వాయిదాలను నిర్దేశిత తేదీల్లో చెల్లించాలని సూచించారు. సకాలంలో రుణాలు చెల్లించని పక్షంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెవెన్యూ వసూళ్ల చట్టం కింద బకాయిల వసూళ్ల ప్రక్రియ ప్రారంభించాల్సి వస్తుందని హెచ్చరించారు. అటువంటి పరిస్థితి ఏర్పడకుండా ప్రతి సభ్యురాలు బాధ్యతతో వ్యవహరించి రుణాల చెల్లింపులో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. రుణాలను



క్రమం తప్పకుండా చెల్లించడం వల్ల మహిళా సంఘాల విశ్వసనీయత పెరగడంతో పాటు భవిష్యత్‌లో అధిక మొత్తంలో రుణాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. సంఘాల పురోగతి సభ్యుల ఆర్థిక క్రమశిక్షణపైనే ఆధారపడి ఉంటుందని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులు పొదుపు అలవాటును కొనసాగిస్తూ, రుణాలను సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచాలని కోరారు. ప్రతి సభ్యురాలు తన బాధ్యతను గుర్తించి రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా మహిళా సాధికారతకు, గ్రామీణ అభివృద్ధికి తోడ్పడాలని మండల ఏపీఎం సంతోష్ పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయం వెనక్కి తీసుకోవాలని విద్యార్థుల వినతి



**అర్జున్ సమాచారం జూన్ 29.మంచిర్యాల జిల్లా. ప్రతినిధి:**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని కోరుతూ ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి. చంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని 23 వేల ప్రభుత్వ పాఠశాలల మూసివేతను పూర్తిగా నిలిపివేయాలని కోరారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్య కల్పించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులపై ఫీజుల భారం పడకుండా ఫీజు నియంత్రణ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని కోరారు. ఉత్తమ అందుబాటు పాఠశాలల పథకం కింద పెండింగ్‌లో ఉన్న రూ.203 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమం తప్పకుండా తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు పి. సికిందర్, పట్టణ నాయకుడు వంశీ, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## బీసీల రాజ్యాధికారమే లక్ష్యం... జులై 5న భువనగిరికి భారీగా తరలిరావాలని పిలుపు

**అర్జున్ సమాచారం జూన్ 29.మంచిర్యాల జిల్లా. ప్రతినిధి:**

మంచిర్యాల జిల్లా, జైపూర్ మండలం జులై 5న భువనగిరిలో నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" సభను విజయవంతం చేయాలని జైపూర్ మండల నాయకుడు భీమిని రమేష్ ఆధ్వర్యంలో కార్నర్ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా "హలో బీసీ--చలో భువనగిరి" ప్రచార పత్రాన్ని జైపూర్ మండల ఆటోరిక్షా కార్మికులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీల రాజ్యాధికార సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తీన్మార్ మల్లన్న నాయకత్వంలోనే బీసీలకు రాజకీయ




ప్రాధాన్యం దక్కుతుందని పేర్కొన్నారు. జులై 5న జరిగే మహాసభకు బహుజనులంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జిల్లా నాయకులు పలువురికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ వర్మ మాట్లాడుతూ బహుజనుల ఐక్యతతో రాజ్యాధికారం సాధ్యమవుతుందని తెలిపారు.

Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthami-nagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.